ఆంధ్రజ్యోతి

DATE -27-DECEMBER-2014

PAGE NO-06

# తీరానికి రక్షణ

## మత్స్యకారుల జీవనోపాధినీ కాపాడాలి

- జీఐఎస్ త్రీడీ మ్యాపింగ్‌తో పక్కాగా సునామీ సమాచారం
- ఇన్‌కాయిస్‌లో కేంద్రమంత్రి డాక్టర్ హర్షవర్ధన్
- ముందస్తు సమాచారంతో హుద్‌హుద్ నష్టం నివారణ: సుజనాచౌదరి

హైదరాబాద్, డిసెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): 'పదేళ్ల కిందట సునామీతో నష్టపోయిన వారికి ఇంకా పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించలేదు. తీరప్రాంతంలో నివాసం ఉండే 30 కోట్ల మందిని ప్రకృతి విపత్తుల నుంచి కాపాడుకోవాలి. ధన, మాన ప్రాణనష్టం జరుగకుండా చూసుకోవాలి. మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినకుండా అప్రమత్తంగా ఉండాలి' అని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, ఎర్త్ సైన్స్ శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. సునామీ వంటి విపత్తుల సమాచారం సేకరించడానికి సముద్రంలో త్రీడీ ఆధారిత జీఐఎస్ మ్యాపింగ్‌ను అమలు చేస్తున్నామని ప్రకటించారు. సునామీ సంభవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ శివారులోని భారత జాతీయ మహా సముద్రాల సమాచార కేంద్రం (ఇన్‌కాయిస్)లో 'భారత్‌లో సునామీల గుర్తించే వ్యవస్థలో పురోగతి, సవాళ్లు, భవిష్యత్ లక్ష్యాలు' అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్ జరిగింది. దీనికి కేంద్రమంత్రి హర్షవర్ధన్ ముఖ్యఅతిథిగా, కేంద్ర సహాయ మంత్రి వై.సుజనాచౌదరి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ, పదేళ్ల కిందట సునామీ అంటే తెలియదని, ప్రస్తుతం దాన్ని ముందే గుర్తించడంలో పురోగతి సాధించామని అన్నారు. మహాసముద్రాల్లో 300 చోట్ల ఎప్పటికప్పుడు పక్కాగా, శాస్త్రీయంగా సమాచారం సేకరిస్తూ హెచ్చరికలు చేస్తున్నామని తెలిపారు. తీర ప్రాంత ప్రజలకే కాకుండా, 26 దేశాలకు ప్రకృతి వైపరీత్యాల సమాచారం అందిస్తున్నామని కేంద్రమంత్రి తెలిపారు. పదేళ్లలో ఇన్‌కాయిస్ ప్రపంచ ఉత్తమ సంస్థగా గుర్తింపు పొందిందని అన్నారు. కాగా, హర్షవర్ధన్ హైదరాబాద్‌పై మాట్లాడుతుండగా, వెనకాలే ఉన్న సుజనాచౌదరి 'ఓన్లీ పొలిటికల్ సునామీ' అంటూ వ్యాఖ్యానించడంతో వర్క్‌షాప్‌లో నవ్వులు విరిశాయి. అనంతరం సుజనా చౌదరి మాట్లాడుతూ, హుద్ హుద్ తీవ్రతపై ముందే సమాచారం ఇవ్వడం వల్ల ప్రాణనష్టం తగ్గించగలిగామని అన్నారు. తుపాను తీవ్రతను ముందే అంచనా వేసిన ఏపీ సీఎం చంద్రబాబు.. టెక్నాలజీతో ప్రాణనష్టాన్ని నివారించారని చెప్పారు. భావితరాలకు సమాచారం అందించే బ్లూ బుక్ తయారు చేయాలని సుజనాచౌదరి కోరారు.



హైదరాబాద్‌లో ఇన్‌కాయిస్‌లో జరిగిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేంద్ర మంత్రి హర్షవర్ధన్, పక్కన కేంద్ర మంత్రి సుజనా చౌదరి

### కడలూరు–నాగపట్నంలో త్రీడీ మ్యాపింగ్

సముద్రం ఎప్పుడూ అల్లకల్లోలంగా ఉండే కడలూరు-నాగపట్నం ప్రాంతంలో 3500 కిలోమీటర్ల మేర సముద్రమట్టాన్ని, అలలను త్రీడీ జీఐఎస్ మ్యాపింగ్‌తో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వర్క్‌షాప్‌లో కేంద్ర ఎర్త్ సైన్స్ మంత్రిత్వశాఖ కార్యదర్శి శైలేష్ నాయక్ తెలిపారు.